నమస్తే తెలంగాణ

# రంగారెడ్డి

I | హైదరాబాద్, మంగళవారం 14 జనవరి 2025 | RANGAREDDY



ఆరుగ్యారెంటీలపై నిరసనగా పతంగులపై ముద్రించి ఆవిష్కరిస్తున్న కొడంగల్ మాజీ ఎమ్మెల్యే పట్నం నరేందర్‌రెడ్డి, పార్టీ యువనేతలు పట్లోళ్ల కార్తీక్‌రెడ్డి, పట్నం అవినాశ్‌రెడ్డి


## 17న షాబాద్‌లో రైతుధర్నా

**పాల్గొననున్న బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్**

**అంబేద్కర్ చౌరస్తాలో సభా స్థలాన్ని పరిశీలించిన కొడంగల్ మాజీ ఎమ్మెల్యే పట్నం నరేందర్‌రెడ్డి, బీఆర్ఎస్ పార్టీ యువనేతలు పట్లోళ్ల కార్తీక్‌రెడ్డి, పట్నం అవినాశ్‌రెడ్డి**

**కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన ఆరు గ్యారెంటీలను పతంగులపై ముద్రించి నిరసనగా ఆవిష్కరణ**

షాబాద్, జనవరి 13 : కాంగ్రెస్ ప్రభుత్వం రైతులకు ఇచ్చిన హామీలు అమలు చేయడంలో పూర్తిగా విఫలమైందని కొడంగల్ మాజీ ఎమ్మెల్యే పట్నం నరేందర్ రెడ్డి అన్నారు. ఈ నెల 17న బీఆర్ఎస్ పార్టీ ఆధ్వర్యంలో షాబాద్‌లో నిర్వహించే రైతు ధర్నా కార్యక్రమానికి పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ హాజరుకానున్నట్లు తెలిపారు. సోమవారం షాబాద్ మండల కేంద్రంలోని అంబేద్కర్ చౌరస్తాలోని సభా స్థలాన్ని యువనేతలు పట్లోళ్ల కార్తీక్‌రెడ్డి, పట్నం అవినాశ్‌రెడ్డిలతో కలిసి పరిశీలించారు. అనంతరం మాజీ ఎమ్మెల్యే మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల్లో ప్రజలకు ఇచ్చిన ఆరు గ్యారెంటీల హామీలను పతంగులపై ముద్రించి నిరసనగా ఆవిష్కరించనున్నామని తెలిపారు. మహిళలకు రూ.2500 పంపిణీ ఏమైందని, కల్యాణలక్ష్మి పథకం కింద తులం బంగారం ఎక్కడికి పోయిందని ప్రశ్నించారు. రైతుభరోసా లేదు.. వడ్లకు బోనస్ లేదు.. కాంగ్రెస్ ప్రభుత్వం ప్రగల్భాలు పలికిందన్నారు. విద్యార్థినులకు స్కూటీలు ఇస్తామని కాంగ్రెస్ సర్కార్ లూటీ చేసిందన్నారు. 2లక్షల ఉద్యోగాలు ఇస్తామని చెప్పిన కాంగ్రెస్ ప్రభుత్వం. నిరుద్యోగులను మోసం చేసిందన్నారు. షాబాద్‌లో నిర్వహించే రైతుధర్నాలో బీఆర్ఎస్ శ్రేణులు, రైతులు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో మాజీ జడ్పీటీసీ జడల రాజేందర్ గౌడ్, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ నక్క శ్రీనివాస్‌గౌడ్, బీఆర్ఎస్ పార్టీ శ్రేణులు ఆరిఫ్, కుమ్మరి దర్శన్, మంగలి సత్యం, కమ్మరి శ్రీను, మధుకర్‌రెడ్డి, ముఖ్రంఖాన్, హరికుమార్, రాంచందర్, శశాంక్‌రెడ్డి, సత్తయ్య, అంబారెడ్డి, పరుశావేది, కావలి కృష్ణయ్య, రాజేందర్‌రెడ్డి, మాజీద్, హరీశ్, హసీం తదితరులు పాల్గొన్నారు.





పతంగులను ఎగురవేస్తున్న చిన్నారులు

ఎల్‌బీ నగర్ ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి నివాసంలో జరిగిన సంక్రాంతి సంబురాల్లో పాల్గొన్న మాజీ మంత్రులు కేటీఆర్, సబితారెడ్డి తదితరులు





భోగి మంటలు



వాకిట్లో ముగ్గులు వేస్తున్న యువతి

## భోగిమంటలు.. రంగవల్లులు

*సంక్రాంతి పండుగ సందర్భంగా ఉమ్మడి జిల్లాలోని పల్లెల్లో సందడి నెలకొన్నది. ఆడపడుచులు, కొత్త అల్లుళ్ల రాకతో ఏ ఇల్లు చూసినా కళకళలాడుతున్నది. సోమవారం భోగి పండుగను జిల్లావాసులు భక్తిశ్రద్ధలతో నిర్వహించుకున్నారు. తెల్లవారుజామునే మంటలు వేసి పాత వస్తువులు, సామగ్రిని అందులో వేసి జీవితంలో కొత్త మలుపు తిరుగాలని కోరుకున్నారు. మహిళలు, ఆడబిడ్డలు ఇండ్ల ముంగిట కల్లాపి చల్లి, రంగవల్లులు వేశారు. చిన్న పిల్లలకు మహిళలు భోగి పండ్లను పోశారు. తెల్లవారుజాము నుంచే మహిళలు పిండి వంటల తయారీలో నిమగ్నమయ్యారు. ఇంటి ముందు గొబ్బెమ్మలు, పిండి కొమ్మలు, రేగి పండ్లను పెట్టి పూజలు చేశారు. యువకులు, చిన్నారులు పతంగులతో బిజీబిజీగా గడిపారు. జిల్లాలో పలుచోట్ల క్రీడలు, ముగ్గుల పోటీలు నిర్వహించారు.*

*- న్యూస్ నెట్‌వర్క్, నమస్తే తెలంగాణ*




- ప్రభుత్వం ఆదేశించి ఆరు నెలలైనా ప్రారంభం కాని దరఖాస్తుల పరిశీలన
- గ్రామ పంచాయతీల్లోనైతే ఎక్కడేసిన గొంగడి అక్కడే..
- మున్సిపాలిటీల్లో మొక్కుబడిగా దరఖాస్తుల పరిశీలన షురూ..
- గ్రామ పంచాయతీల్లో 16,229 ఎల్ఆర్ఎస్ దరఖాస్తులు
- నాలుగు మున్సిపాలిటీల్లో 21,084 దరఖాస్తులు

## 'ఎల్ఆర్ఎస్' పూర్తయ్యేదెప్పుడూ..!

**జిల్లాలో ఎల్ఆర్ఎస్(అనుమతిలేని లేఅవుట్ క్రమబద్ధీకరణ పథకం) దరఖాస్తుల పరిశీలన ప్రక్రియ నత్తనడకన సాగుతున్నది. రాష్ట్ర ప్రభుత్వం మూడు నెలల్లో పూర్తి చేయాలని ఆదేశించి ఆరు నెలలు గడిచినా దరఖాస్తుల పరిశీలన ప్రక్రియ ప్రారంభించలేదు. ఎల్ఆర్ఎస్ దరఖాస్తుల పరిశీలనకు ప్రత్యేకంగా బృందాలను ఏర్పాటు చేసి, శిక్షణ ఇచ్చినప్పటికీ అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారు. మున్సిపాలిటీల్లో దరఖాస్తుల పరిశీలన ప్రక్రియను ప్రారంభించగా, గ్రామ పంచాయతీల్లో మాత్రం ఇంకా షురూ కాలేదు. జిల్లా ఉన్నతాధికారుల పర్యవేక్షణ లేకపోవడంతో ఎల్ఆర్ఎస్ దరఖాస్తుల పరిశీలన ప్రక్రియ మొక్కుబడిగా సాగుతున్నది. బాధ్యతలు అప్పగించిన బృందాలకు సొంత శాఖల పనులు ఉండడంతోపాటు ఇతర ప్రభుత్వ కార్యక్రమాలతో జాప్యం జరుగుతున్నట్లు ఉన్నతాధికారులు చెబుతున్నారు. జిల్లావ్యాప్తంగా 37,313 ఎల్ఆర్ఎస్‌కు దరఖాస్తు చేసుకోగా, వీటిలో అత్యధికంగా మున్సిపాలిటీల్లో 21,084 దరఖాస్తులు, గ్రామ పంచాయతీల్లో 16,229 దరఖాస్తులు వచ్చాయి.**

**- వికారాబాద్, జనవరి 13 (నమస్తే తెలంగాణ)**

### ఎల్ఆర్ఎస్ ప్రక్రియలో జాప్యం...

జిల్లాలో అనుమతిలేకుండా ఏర్పాటు చేసిన లేఅవుట్ల క్రమబద్ధీకరణకు వచ్చిన దరఖాస్తుల పరిశీలన ప్రక్రియలో తీవ్ర జాప్యం జరుగుతున్నది. వీలైనంత త్వరితగతిన పూర్తి చేయాలని ప్రభుత్వం ఆదేశించినా మరో మూడు, నాలుగు నెలల సమయం పట్టేలా ఉన్నది. మున్సిపాలిటీలో టీపీవో(టౌన్ ప్లానింగ్ ఆఫీసర్), ఇరిగేషన్ ఏఈ, ఆర్ఐ(రెవెన్యూ ఇన్‌స్పెక్టర్) లతో బృందాన్ని, గ్రామ పంచాయతీల్లో ఆర్ఐ, ఇరిగేషన్ ఏఈ, పంచాయతీ కార్యదర్శులను ఎల్ఆర్ఎస్ దరఖాస్తుల పరిశీలనకుగాను టీంలుగా ఏర్పాటు చేసింది. జిల్లావ్యాప్తంగా నీటిపారుదల శాఖలో నలుగురు మాత్రమే ఇరిగేషన్ ఏఈలు ఉన్నారు. జిల్లాలోని వికారాబాద్, తాండూరు, పరిగి, కొడంగల్ మున్సిపాలిటీలకు ప్రత్యేకంగా టౌన్ ప్లానింగ్ అధికారులు ఉండాల్సి ఉండగా, కేవలం తాండూరు, వికారాబాద్ మున్సిపాలిటీలకు మాత్రమే టౌన్‌ప్లానింగ్ అధికారులు ఉన్నారు. పంచాయతీ కార్యదర్శులకు మొన్నటి వరకు ఓటరు జాబితా బాధ్యతలు ఉండడం, ఆర్ఐలకు ధరణి బాధ్యతలతోపాటు రెవెన్యూ ఫైళ్లకు సంబంధించి వీరే రిపోర్ట్‌లు ఇవ్వాల్సిన పరిస్థితి నెలకొన్నది. పరిశీలన బృందంలో ఉన్న ఇరిగేషన్ ఏఈలకు సంబంధించి సిబ్బంది కొరత ఉండడంతోపాటు మరోవైపు ఆర్ఐలు, పంచాయతీ కార్యదర్శులకు ఇతర బాధ్యతలు ఉండడంతో ఎల్ఆర్ఎస్‌పై దృష్టి సారించడం లేదు. ఒకవేళ ఎల్ఆర్ఎస్ దరఖాస్తుల పరిశీలన ప్రారంభించినప్పటికీ మరో మూడు, నాలుగు నెలల సమయం పట్టే అవకాశం ఉన్నది. గ్రామ పంచాయతీల్లో 16,229 దరఖాస్తులురాగా, ఇప్పటివరకు ఒక్క దరఖాస్తుకు సంబంధించి పరిశీలన చేయలేదు. మరోవైపు వికారాబాద్, తాండూరు, పరిగి, కొడంగల్ మున్సిపాలిటీల్లో 21,084 దరఖాస్తులు ఉండగా, వీటిలో ఇప్పటివరకు కేవలం 424 దరఖాస్తులకు సంబంధించి ప్రక్రియను ప్రారంభించగా, ఒక్క దరఖాస్తు పరిశీలన కూడా పూర్తి కాలేదు. పరిశీలన ప్రక్రియలో భాగంగా ప్రభుత్వ భూమి, అసైన్డ్ తదితర వివరాలను పూర్తిగా పరిశీలించి ప్రత్యేక యాప్‌లో వివరాలను పొందుపరుస్తున్నారు. సంబంధిత ప్లాట్ల విస్తీర్ణాన్ని బట్టి ప్రభుత్వ మార్గదర్శకాల ప్రకారం రెగ్యులరైజ్ డబ్బులను లబ్ధిదారులు చెల్లిస్తున్నారు. ఎల్ఆర్ఎస్ దరఖాస్తుల పరిశీలన అనంతరం ఎంత మొత్తంలో ఫీజులు చెల్లించాలనే దానిపై దరఖాస్తుదారులకు మెస్సేజ్ రూపంలో సమాచారం అందించనున్నారు. ఆ తర్వాత సంబంధిత విస్తీర్ణానికి అనుగుణంగా ఫీజులు చెల్లించాల్సి ఉంటుంది. నామమాత్రంగా తనిఖీలు చేస్తే అక్రమంగా వెలిసిన ప్లాట్లు రెగ్యులరైజ్ అయ్యే అవకాశం ఉన్నది. పరిశీలన ప్రక్రియ పారదర్శకంగా చేయనట్లయితే బఫర్ జోన్, ఎఫ్‌టీఎల్, ప్రభుత్వ భూముల్లోని ప్లాట్లు కూడా రెగ్యులరైజ్ అయ్యే అవకాశాలు ఉంటాయని జిల్లావాసులు ఆరోపిస్తున్నారు.




- బిల్లుల చెల్లింపులపై జాప్యం చేస్తున్న ప్రభుత్వం
- రెండు, మూడు నెలలుగా పాల బిల్లులు పెండింగ్‌లోనే..
- ఆర్థిక ఇబ్బందులు తట్టుకోలేక కాంగ్రెస్ సర్కార్‌పై పాడిరైతుల ఆగ్రహం
- గత బీఆర్ఎస్ ప్రభుత్వం రైతులకు అండగా నిలిస్తే.. కాంగ్రెస్ ప్రభుత్వం నుంచి ప్రోత్సాహం కరువైందని ఆగ్రహం
- పెరుగుతున్న పశుగ్రాసం, దాణా ధరలు.. పెరగని పాల రేట్లు..
- హైదరాబాద్ నగరానికి జిల్లా నుంచే అధిక శాతం పాల సరఫరా



ఇబ్రహీంపట్నంలోని డెయిరీ

## పాడిరైతుల పరేషాన్

**హైదరాబాద్ నగరవాసులకు పాలను అందించడంలో రంగారెడ్డి జిల్లావాసులు ముందువరుసలో ఉన్నారు. ఇబ్రహీంపట్నం, చేవెళ్ల, రాజేంద్రనగర్, మహేశ్వరం నియోజకవర్గాల నుంచి నిత్యం లక్షలాది లీటర్ల పాలను నగరానికి తీసుకొస్తున్నారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వ హయంలో సంతోషంగా ఉన్న పాడిరైతులు.. నేడు ఆర్థిక ఇబ్బందులతో కొట్టుమిట్టాడుతున్నారు. సకాలంలో బిల్లులు చెల్లించడంతో పాటు సబ్సిడీపై పాడి పశువుల కొనుగోలు, దాణా, ఉచిత వైద్య శిబిరాలను నిర్వహించి పాడి రైతులకు అండగా నిలిచింది. డెయిరీ ఫాంలను నెలకొల్పుకొనేందుకు బ్యాంకుల నుంచి రుణాలను ఇచ్చింది. అయితే కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన నాటి నుంచి పాడి రైతులకు కష్టాలు మొదలయ్యాయి. సకాలంలో బిల్లులు రాక, ఖర్చులు పెరిగినా పాల ధర పెరుగక ఆర్థిక ఇబ్బందులతో కొట్టుమిటాడుతున్నారు. దీనికి తోడు మూలిగే నక్కపై తాటి పండు పడిన చందంగా పశువుల దాణా, పశుగ్రాసం ధరలు పెరిగాయి. రాష్ట్ర సర్కార్ స్పందించి ఆర్థికంగా అండగా నిలువకపోతే పాడిపరిశ్రమలను మూసి వేయాల్సిన పరిస్థితి దాపురించనున్నదని పాడి రైతులు పేర్కొంటున్నారు.**

**- రంగారెడ్డి, జనవరి 11 (నమస్తే తెలంగాణ)/షాద్‌నగర్‌రూరల్**

### పెరగని పాల ధరలు.. అందని బిల్లులు..

ప్రస్తుతం లీటరు పాల ధర రూ.40 నుంచి రూ.50 మాత్రమే ఉన్నది. ప్రభుత్వం పట్టించుకుని లీటరుకు రూ.60 నుంచి రూ.70 పెంచితే గిట్టుబాటు అవుతుందని రైతులు అభిప్రాయపడున్నారు. బిల్లుల చెల్లింపుల్లోనూ కాంగ్రెస్ ప్రభుత్వం తీవ్ర జాప్యం చేస్తున్నదని రైతులు వాపోతున్నారు. 15 రోజులకు ఒకసారి రావాల్సిన బిల్లులు రెండు నెలలు గడిచినా అందడం లేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. షాద్‌నగర్ నియోజకవర్గంలో నిత్యం 17వేల లీటర్ల పాల దిగుబడి వస్తున్నది. కొందుర్గు, ఎక్లాస్‌ఖాన్‌పేట్ బీఎంసీ సెంటర్లు ఉన్నాయి. 15రోజులకు ఇవ్వాల్సిన బిల్లులు చెల్లింపు రెండు నెలలైనా అందకపోవడంతో పాడి రైతులు ఆర్థిక ఇబ్బందులను ఎదుర్కొంటున్నారు. జిల్లాలో అమూల్, జెర్సీ, తిరుమల, విజయ, మస్కతి, దొడ్లపాలు వంటి సంస్థలు పాలను కొనుగోలు చేస్తున్నాయి. అయితే ఈ సంస్థలు గిట్టుబాటు ధర ఇవ్వడం లేదు. హైదరాబాద్ నగరానికి జిల్లా ఆనుకుని ఉండడంతో అధిక శాతం రైతులు పాలను తీసుకెళ్లి నగరంలో విక్రయిస్తున్నారు.

### పెరిగిపోతున్న పశుగ్రాసం, దాణా ధరలు..

రోజురోజుకూ పశుగ్రాసం, దాణా ధరలు పెరుగుతున్నాయి. కానీ, పాల ధర మాత్రం పెరుగడం లేదు. గత బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో క్వింటాల్ దాణాకు రూ.120 ఉండగా, ప్రస్తుతం రూ.220 నుంచి రూ.250కి పెరిగింది. జిల్లాలో వరిపంట సాగు కూడా గణనీయంగా తగ్గడంతో పశుగ్రాసం కొరత ఏర్పడింది. దీంతో ఇతర ప్రాంతాల నుంచి పశుగ్రాసాన్ని కొనుగోలు చేయాల్సిన పరిస్థితి ఏర్పడింది. ఏడాది కింద ఉన్న ఖర్చు.. ఇప్పుడు రెట్టింపు కావడంతో ఆర్థికంగా ఇబ్బందులు ఎదుర్కొవాల్సి వస్తున్నదని జిల్లారైతులు ఆవేదన చెందుతున్నారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వం ఎరువులు, విత్తనాలు, బ్యాంకు రుణాల్లో రాయితీ ఇచ్చి ఆదుకున్నదని, ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం పాడి రైతులను పూర్తిగా విస్మరించిందని జిల్లా రైతులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

#### ధరలు పెరిగాయి..



పశుగ్రాసం, దాణా ధరలు విపరీతంగా పెరగడంతో నష్టాలు తప్పా...లాభాలు రావడం లేదు. ప్రభుత్వం పాల ధరను పెంచాలి. పాడి పరిశ్రమను నమ్ముకుని బతుకుతున్నాం. బ్యాంకుల ద్వారా రాయితీపై లోన్లు ఇప్పించి ఆదుకోవాలి.

– వరప్రసాద్‌రెడ్డి, నజ్దిక్‌సింగారం

#### రాయితీపై లోన్లు ఇవ్వాలి..



పశుగ్రాసం, గడ్డి విత్తనాలు, ఎరువులపై సబ్సిడీ ఇవ్వడంతో పాటు బ్యాంకుల ద్వారా రాయితీపై లోన్లు ఇప్పించి పాడి రైతులను ప్రభుత్వం ఆదుకోవాలి. ఖర్చులు పెరుగుతున్న కారణంగా పాల లీటరు ధరను రాష్ట్ర సర్కార్ పెంచాలి. లేదంటే డెయిరీ ఫాం నడపడం చాలా కష్టమే.

– సురేశ్

#### ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నాం..



బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో సకాలంలో బిల్లులు వచ్చేవి. ప్రైవేటు సెంటర్లకు పాలు పోయకుండా విజయ డెయిరీ సెంటర్‌లోనే పోసేది. నేడు బిల్లుల చెల్లింపులో తీవ్ర జాప్యం చేస్తుండడంతో ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నాం. షాద్‌నగర్ నియోజకవర్గానికి సంబంధించి ప్రభుత్వం పెండింగ్ బిల్లులను పూర్తిగా చెల్లించకుండా కేవలం రూ. 50 కోట్లను మాత్రమే విడుదల చేయడం బాధాకరం.

–చంద్రశేఖర్, పాడి రైతు, విఠ్యాల గ్రామం

#### మూడు బిల్లులు చెల్లించాల్సి ఉన్నది..



నియోజకవర్గం నుంచి అనునిత్యం సుమారు 17వేల లీటర్ల పాలను సేకరిస్తున్నాం. ఇంకా కేవలం మూడు బిల్లులను మాత్రమే చెల్లించాల్సి ఉన్నది. త్వరలోనే వాటిని కూడా అందజేస్తాం. ప్రైవేటు కంటే అధిక ధరను కట్టిస్తున్నాం. బిల్లుల జాప్యంపై ఎవరూ ఆందోళన చెందవద్దు.

– సురేశ్, మేనేజర్ పాలశీతలి కేంద్రం షాద్‌నగర్




షాద్‌నగర్‌లోని డెయిరీ